రికగ్నైజ్డ్‌ స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శిగా అనిల్‌ కుమార్‌



అనిల్‌ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చందానగర్‌ : తెలంగాణ రికగ్నైజ్డ్‌ స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చందానగర్‌ విద్యా వాణి హైస్కూల్‌ కరెస్పాండెంట్‌ కె.అనిల్‌ కుమార్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చందానగర్‌లో శేరిలింగంపల్లి ప్రైవేట్‌ స్కూల్‌ కరెస్పాండెంట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ సభ్యులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా మండల అధ్యక్షులుగా, జిల్లా ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా పదవులు సమర్థవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అనంతరం అనిల్‌ కుమార్‌ మాట్లాడుతూ ప్రైవేట్‌ స్కూల్‌ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రైవేట్‌ స్కూల్‌ కరెస్పాండెంట్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

'కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న సీఎం'



సమావేశంలో పాల్గొన్న జిల్లా ముఖ్య నాయకులు

రాయదుర్గం: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఎంఎస్పీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు రావుగాళ్ళ బాలుమాదిగ విమర్శించారు. ఆదివారం రాయదుర్గం శ్యామ్‌లేట్‌ వీధిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్‌ సీనియర్‌ నాయకుడు శ్యామ్‌లేట్‌ గణేష్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం విధానాన్ని నిరసిస్తూ ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సులో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నూతన దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న కృష్ణారావు కుటుంబ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ హౌసింగ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు, ఎక్స్‌ ఆర్మీ వారెంట్‌ ఆఫీసర్‌ ఎం. కృష్ణారావు మనవడు, మనవరాళ్లు నీట్‌పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఎంబీబీఎస్‌ కన్వీనర్‌ కోటాలో సీట్లు పొందిన సందర్భంగా ఆదివారం కాలనీ జీహెచ్‌ఎంసీ సిబ్బందికి, సూపర్‌ వైజర్‌కు నూతన దుస్తులు అందజేశారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌ వే పిల్లర్‌ నంబర్‌ 191 వద్ద మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్‌ వైపు వచ్చే దారిలో రోడ్డు పక్కన ఉన్న కల్వర్ట్‌ వద్ద ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్‌ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.రాజేందర్‌ గౌడ్‌, ఎస్‌ఐ ఎస్‌.రాజేందర్‌, కానిస్టేబుల్‌ సురేశ్‌, హెచ్‌.జి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రఘువీర భక్త సమాజానికి అగ్రస్థానం

అత్తాపూర్‌: భద్రాద్రి శ్రీరాముల వారి సన్నిధిలో శనివారం రాత్రి జరిగిన భజన కార్యక్రమంలో అత్తాపూర్‌కు చెందిన రఘువీర భక్త సమాజం వారు చేసిన భజన కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లాలోనే ప్రథమ స్థానం నిలిచింది. ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న భజన కార్యక్రమం ఎంతగానో భక్తులను ఆకట్టుకుంటుందని భక్త సమాజం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కె.ప్రభాకర్‌రెడ్డి, మంగళారం గోవర్ధన్‌రెడ్డి, హంజా శంకర్‌, భాస్కర్‌గౌడ్‌, రాహుల్‌రెడ్డి, నాగేష్‌, నరేందర్‌కుమార్‌, రవీందర్‌గౌడ్‌, వేణుగౌడ్‌, హరి, కిరణ్‌, శ్రీశైలం, దయానంద్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌గా రాజేందర్‌గౌడ్‌

అత్తాపూర్‌: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలను తప్పకుండా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.రాజేందర్‌గౌడ్‌ తెలిపారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అల్వాల్‌ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయనకు స్థానిక సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్‌గౌడ్‌ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నివారణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. వాహనదారులు లైసెన్స్‌, హెల్మెట్‌, సీట్‌ బెల్టులను తప్పక ధరించి వాహనాలను నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని వారికి ఇస్తే వాహనాల యజమానులపై చర్యలు తప్పవన్నారు.

జంక్షన్‌ జామ్‌కు చెక్‌

ఐటీ కారిడార్‌ ఫ్రీ లెఫ్ట్‌లకు మోక్షం | చకచకా విస్తరణ పనులు

ఐటీ కారిడార్‌లో జంక్షన్ల జామ్‌తో ట్రాఫిక్‌ సమస్య తీవ్రమవుతోంది. ఫ్రీ లెఫ్ట్‌లలోను ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో కిలో మీటర్ల పొడువునా వాహనాల రాకపోకలు నిలిపోతున్నాయి. నిత్యం ఐటీ ఉద్యోగులతో పాటు సాధారణ వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరగడం, కూడళ్ల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్‌ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. సైబరాబాద్‌ ట్రాఫిక్‌ పోలీసులు, జీహెచ్‌ఎంసీ వెస్ట్‌ జోనల్‌ అధికారులు కూడళ్లు, బాటిల్‌ నెక్‌ రోడ్లను పరిశీలించారు. మొదట కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్‌కు మార్గం సుగమమం చేయాలని వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి ఇంజినీరింగ్‌ విభాగం అధికారులను ఆదేశించారు. ఫ్రీ లెఫ్ట్‌లలో విస్తరణ కోసం టెండర్లు పిలిచి విస్తరణ పనులు చేపట్టారు.

– గచ్చిబౌలి



హెచ్‌సీయూ డిపో కూడలిలో విస్తరణ పనులు

- పటాన్‌చెరు, అమీన్‌పూర్‌, చందానగర్‌, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల నుంచి ఉదయం సమయంలో వచ్చే వాహనాలతో హెచ్‌సీయూ డిపో వద్ద వాహనాలు బారులు దీరుతున్నాయి. సిగ్నల్‌ దాటలంటే కొద్ది నిమిషాలు ట్రాఫిక్‌లో ఉండాల్సిందే.
- చందానగర్‌ లింకు రోడ్డు నుంచి హెచ్‌సీయూ డిపో సిగ్నల్‌ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. ఫ్రీ లెఫ్ట్‌ పనులు పూర్తయితే లింగంపల్లి నుంచి వచ్చే వాహనాలు మసీద్‌బండ మీదుగా మాదాపూర్‌కు సులువుగా వెళ్లవచ్చు.



ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌లో విప్రో సర్కిల్‌ వైపు వెళ్లేందుకు చేపట్టిన ఫ్రీ లెఫ్ట్‌ పనులు



డీఎల్‌ఎఫ్‌ నుంచి కొండాపూర్‌ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్‌ కోసం చేపట్టిన విస్తరణ పనులు



మసీద్‌బండ నుంచి శరత్‌సిటీ క్యాపిటల్‌మాల్‌ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట పనులు

- అంతే కాకుండా మసీద్‌బం నుంచి వచ్చే వాహనాలు హెచ్‌సీయూ వైపు వెళ్లేందుకు విస్తరణ పనులు చేపట్టారు. ఫ్రీ లెఫ్ట్‌ పనులు పూర్తయితే సిగ్నల్‌ వద్ద జామ్‌ తగ్గే వీలుంది.
- ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్‌ జీమ్‌ ఉంటోంది. గచ్చిబౌలి వైపు నుంచి వచ్చే వాహనాలతో జంక్షన్‌లో ట్రాఫిక్‌ జామ్‌ నెలకొంటుంది. విప్రో సర్కిల్‌ వైపు వాహనాల కోసం విస్తరణ పనులు చేపట్టారు. ఫ్రీ లెఫ్ట్‌ పనులు పూర్తయితే రెడ్‌సిగ్నల్‌ ఉన్నా విప్రో సర్కిల్‌ వైపు వాహనాలు వెళ్లేందుకు వీలుంటుంది.
- గచ్చిబౌలి– కొండాపూర్‌ రోడ్డులో ప్లాటినా వద్ద ఫ్రీ లెఫ్ట్‌ పనులు చకచకా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే టీఎల్‌ఎఫ్‌ నుంచి వచ్చే ఐటీ ఉద్యోగుల వాహనాలు మాదాపూర్‌, మియాపూర్‌, మసాద్‌బండ వైపు సులువుగా వెళ్లవచ్చు.
- బొటానికల్‌ గార్డెన్‌ వద్ద మసీద్‌బండ వైపు నుంచి వచ్చే వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. శరత్‌ సీటీ క్యాపిటల్‌ మాల్‌ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్‌కు అవకాశం లేకపోవడంతో కిలో మీటరు పొడువునా వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. వీకెండ్‌లో శరత్‌ సిటీ క్యాపిటల్‌మాల్‌కు వేలాది వాహనాలు తరలి రావడంతో జంక్షన్‌లో జామ్‌ నెలకొంటుంది. మూల మలుపు వద్ద ఫ్రీ లెఫ్ట్‌ పనులు పూర్తి కావస్తున్నాయి.



కొండాపూర్‌ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్‌ లేకపోవడంతో వాహనాలు నిలిచిపోయిన దృశ్యం

- సైబర్‌ టవర్‌ నుంచి కూకట్‌పల్లి వైపు రోడ్డు ఇరుకుగా ఉండటంతో సాయంత్రం సమయంలో వాహనాలు వెళ్లేందుకు చాలా సమయం పడుతోంది. సైబర్‌టవర్‌ ఫ్లై ఓవర్‌ ఎండింగ్‌ నుంచి యశోద హస్పిటల్‌ వరకు సర్వీస్‌ రోడ్డును విస్తరించారు. దీంతో కొంత ట్రాఫిక్‌ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.
- గచ్చిబౌలి జంక్షన్‌లో ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌ నుంచి వచ్చే వాహనాలు కొండాపూర్‌ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్‌ లేకపోవడంతో ట్రాఫిక్‌ జామ్‌ నెలకొంటుంది. అక్కటో ఆటోవాలాలు తిష్ట వేయడంతో గ్రీన్‌ సిగ్నల్‌ పడ్డా కొండాపూర్‌ వైపు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. జంక్షన్‌లో భవనాలను తొలగించి విస్తరణ చేస్తేనే జంక్షన్‌ జామ్‌కు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

సమస్యను పరిష్కరిస్తాం



ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ సమస్యపై సమన్వయ సమావేశంలో చర్చిస్తున్నాం. సమస్యను పోలీసులు అధికారులతో కలిసి పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ పరిధిలో ట్రాఫిక్‌ సమస్య పరిష్కారం కోసం సత్వర చర్యలకు శ్రీకారం చుట్టాం. సైబర్‌టవర్‌ నుంచి కూకట్‌పల్లి వైపు రోడ్డు విస్తరణ, ప్రధాన కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్‌ల కోసం పనులు చేపట్టాం. బాటిల్‌ నెక్‌, పాట్‌హోల్స్‌పై దృష్టిసారించాం.

పి.ఉపేందర్‌ రెడ్డి, జోనల్‌ కమిషనర్‌, వెస్ట్‌ జోన్‌

24న మాస్టర్స్‌ అథ్లెటిక్‌ క్రీడాకారుల డిస్ట్రిక్ట్‌ సెలక్షన్స్‌

చందానగర్‌ : ఈ నెల 24న చందానగర్‌లోని పీజేఆర్‌ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా మాస్టర్‌ అథ్లెటిక్‌ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు మాస్టర్‌ అథ్లెట్స్‌ అసోసియేషన్‌ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లో మాస్టర్స్‌ అసోసియేషన్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరిలో నిర్వహించే పోటీలలో జిల్లా నుంచి పాల్గొనే మాస్టర్స్‌ పతకాలు ఎక్కువ సంఖ్యలో తీసుకురావాలన్నారు. సెలక్షన్స్‌ అనంతరం ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూను సురేందర్‌, అసోసియేషన్‌ ట్రెజరర్‌ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఇనార్బిట్‌ ఆధ్వర్యంలో బడే దిల్‌వాలీ దీపావళి

సాక్షి సిటీబ్యూరో: దీపావళి పండుగను పురస్కరించుకొని సైబరాబాద్‌లోని ఇనార్బిట్‌ మాల్‌ 'బడే దిల్‌వాలి దీపావళి' పేరిట ఒక ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నుంచి ప్రారంభించింది. ఈ దీపావళికి అందరూ ఒకే కుటుంబంగా మారాలని కోరుతుందని, అలాగే ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని స్వీకరించమని ప్రోత్సహిస్తుందని మాల్‌ ప్రతినిధులు తెలిపారు. డిజిటల్‌, ప్రింట్‌ మధ్యమాల ద్వారా చేసే ఈ ప్రచారం కుటుంబం స్నేహితుల ప్రాముఖ్యతను మాత్రమే కాకుండా సేవా సిబ్బంది, సహోద్యోగులు, పొరుగువారు సహా మన రోజువారీ జీవితాలకు సహకరించే ప్రతి ఒక్కరికి పండుగలో భాగం పంచాలని ఉద్బోధిస్తుందన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజేంద్రనగర్‌: కాలనీలు, బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని పలువురు కోరారు. రాజేంద్రనగర్‌ హసన్‌నగర్‌లోని నూరానీ జమా మసీదు ప్రాంతంలో ఆదివారం అబాబిల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మౌలానా హఫీజ్‌ సయ్యద్‌ షా తౌఫిక్‌ ఉల్లా హుస్సేన్‌ బఖారీ, డాక్టర్‌ మహ్మద్‌ ముజతబా హుస్సేన్‌లు పాల్గొని వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్‌లు షేక్‌ అన్సారీ, హబీబ్‌ జైన్‌ ఆరీఫ్‌, మాజీ వైస్‌ చైర్మన్‌ మహ్మద్‌ బ్దుల్‌ ఖదీర్‌, మహ్మద్‌ మహబూబ్‌, మహ్మద్‌ ఖలీల్‌ అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళలను ప్రోత్సహించాలి

- ప్రముఖ శాస్త్రవేత్త, మిథానీ ఎండీ ఎస్‌కె ఝూ

చందానగర్‌ : చందానగర్‌లోని అపర్ణ హిల్స్‌ పార్కు అవెన్యూలో శాస్త్ర, సంగీత, సాహిత్య సమ్మేళనం ఆధ్వర్యంలో గాన కచేరి, కూచిపూడి నృత్యం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త, మిథానీ చైర్మన్‌, ఎండీ ఎస్‌కె ఝూ, కూచిపూడి నృత్య గురువు సి.బాలాత్రిపుర సుందరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నృత్య కళలను ప్రోత్సహించాలి, సాంస్కృతి సాంప్రదాయాలను ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. శాస్త్రవేత్తలతో కలిసి నృత్య కళలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. గత 10 సంవత్సరాల నుంచి శాస్త్ర, సంగీత, సాహిత్య సమ్మేళనం ఫౌండర్‌, అధ్యక్షులు వేంపాటి లక్ష్మీ నారాయణ శర్మ ఆధ్వర్యంలో గాన కచేరి, కూచిపూడి నృత్యం నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. ప్రముఖ గాయకులు వినోద్‌ బాబు, చింతలపాటి సురేష్‌, నంది అవార్డు గ్రహిత, సినీగాయని సురేఖ మూర్తిలు సంగీత కచేరి, బాలత్రిపుర సుందరి శిష్య బృందంచే కూచిపూడి నృత్యాలు నిర్వహించారు. గాయకులు పాడిన పాటలు, కూచిపూడి నృత్యాలు అందరి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు వేంపాటి లక్ష్మీ నారాయణ శర్మ, ఇస్రో శాస్త్రవేత్త, పద్మశ్రీ జ్ఞానగాంధీ, అపర్ణ హిల్స్‌ ఎవెన్యూ వాసులు తదితరులు పాల్గొన్నారు.



శాస్త్ర, సంగీత, సాహిత్య సమ్మేళనంలో నృత్య కళాకారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్‌: కళాకారులు సంగీత కచేరీతో, కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఐఐటీ విద్యార్థులు డాక్టర్‌ టికె సరోజ ఆధ్వర్యంలో సంగీత కచేరీని నిర్వహించారు. సుస్వర, మధురిమ, అనుష్క, ప్రియాంష్‌, ఉదయ్‌కుమార్‌ రాణాప్రతాప్‌, సోహం, వైష్ణవి తదితరులు పాల్గొని సంగీత కచేరీతో ఆకట్టుకున్నారు. కల్వచర్ల విజయలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. టీవి నటుడు జెఎల్‌ శ్రీనివాసులు, స్వాతిమీనన్‌ కళాకారులను అభినందించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 50, పచ్చిమిర్చి 50, బెండ 70, కాకర 50, దొండ 50, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 70, వంకాయ 50, గోకర 60, బీన్స్‌ 150, బీట్‌రూట్‌ 50, క్యాప్సికమ్‌ 80, క్యాబేజీ 40, క్యారెట్‌ 50, చిక్కుడు 80, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 400

సర్కారు భూమిలో బోర్డుల తొలగింపు

శంషాబాద్‌: పట్టణంలోని 626బై 1 ఉన్న సర్కారు భూమిలో అక్రమార్కులు చదును చేస్తున్నారనే ఉద్దేశంలో తహసీల్దార్‌ రవీందర్‌ దత్తూ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ అధికారులు అక్కడ ప్రభుత్వ స్థలంగా సూచిస్తున్న బోర్డులను ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలోనే ఉన్న వెంచర్‌ నిర్వాహకులు ఆ స్థలాన్ని కలిపేసుకునేందకు కొన్నేళ్లుగా పావులు కదుపుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు రాజకీయ నేతల అండదండలు కూడా ఉండటంతో సదరు స్థలాన్ని చదును చేశారు. ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును సైతం తొలగించడంతో ఆదివారం ఉదయం స్థానికులు ప్రభుత్వ స్థలం వద్దక వెళ్లి పరిస్థితిని పరిశీలించి మరోమారు అధికారులకు పరిస్థితిని వివరించారు. దీంతో రెవెన్యూ అధికారులు మరోమారు స్థలాన్ని పరిశీలించారు. 626బై1లో హెచ్‌ఎండీఏకు మొత్తం 360 ఎకరాల స్థలం ఉంది. ఇందులో 5.17 ఎకరాల స్థలం కబ్జాకు గురైనట్లు 2022 మార్చిలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి తేల్చారు. హెచ్‌ఎండీఏ సంబంధిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సిందిగా అప్పట్లోనే సూచించారు.

'సే నో టు డ్రగ్స్‌' పోస్టర్‌ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన నరసింహను ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో విద్యార్థులు డ్రగ్స్‌ తీసుకుంటూ చెడు అలవాట్లకు గురవుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 'సే నో టు డ్రగ్స్‌' పోస్టర్‌ను సీఐ నరసింహ ఆవిష్కరించారు. కొద్ది రోజులుగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్‌ విచ్చలవిడిగా లభిస్తోందని, యువత బానిసలుగా మారి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటు, ఇతరులపై దాడులకు దిగుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్యామ్‌, ఉపాధ్యక్షుడు దుర్గ, వివేకానందనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్‌, వికాస్‌, అభి, సాయితనయ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

ఆల్విన్‌కాలనీ: ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌ జెరిపేటి జైపాల్‌ జన్మదినం సందర్భంగా ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు రూబెన్‌, ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, యోగేశ్వరి, రామారావు, రాజేష్‌, మున్నా, రాజా, బాలు తదితరులు పల్గొన్నారు.

బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో..

వివేకానందనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఎంబీసీ చైర్మన్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొరపల్లి పరుశరాములు, నాగుల మల్లేష్‌, బొల్లం యాకయ్య పాల్గొన్నారు.

కాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

రాయదుర్గం: నవోదయ కాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడుతామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నవోదయ కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయనకు వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నవోదయకాలనీలో పర్యటిస్తామని వారికి హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిలిగిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తా మని, త్వరలోనే సీసీరోడ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు దశలవారిగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమున్నచోట డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే దాన్ని చిత్తశుద్ధితో పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడసత్యనారాయణ, కాలనీ వాసులు వాసు, శేఖర్‌, రవి, వంశీ, సత్యం, భూపాల్‌రెడ్డి, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు